ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 13 : మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛతీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధి నెండ్ర అడవుల్లో కోబ్రా 210వ బెటాలియన్, సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ భద్రతా దళాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపారు. దీంతో ఇరువర్గాల మధ్య జరిగిన భీకరపోరులో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన భారీ ఎత్తున ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. నారాయణ్‌పూర్ జిల్లా దక్షిణ అబూజ్‌మడ్‌లో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా.. బస్తర్ రేంజ్ పరిధిలో వరుసగా రెండోరోజు కొనసాగిన ఎదురుకాల్పుల్లో మొత్తం 9 మంది మావోయిస్టులు హతమయ్యారు. ప్రస్తుతం సెర్చింగ్ ఆపరేషన్స్ వేగవంతమైనట్లు తెలుస్తోంది. భారీగా మోహరించిన భద్రతా దళాలు అడవిని జల్లెడ పడుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్

కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్

మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 13: పండుగలు, నూతన సంవత్సర వేడుకలు, ఎన్నికల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్–30 అమలులోకి వచ్చిందని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా సామాజిక వేడుకలు, ఈవెంట్లు, ప్రదర్శనలు, ఆందోళనలు, సభలు–సమావేశాలు నిర్వహించకూడదని చెప్పారు. రోడ్ల మీద, బహిరంగ ప్రదేశాల్లో గుమికూడవద్దని అన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటగామని హెచ్చరించారు. సంగీతం, పాటలు, ప్రసంగాలు, లౌడ్ స్పీకర్లు, డీజేల వినియోగం కూడా ఈ యాక్ట్ కింద నిషిద్ధమని వివరించారు. ఈ యాక్ట్‌ను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధి నిర్వాహణలో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, హోంగార్డులతోపాటు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ నిబంధనలు వర్తించవని స్పష్టం చేశారు.

అల్లం నారాయణ జన్మదిన వేడుకలు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 13: రాష్ట్ర తొలి ప్రెస్ అకాడమీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ జన్మదిన వేడుకలను టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ హెచ్–143 యూనియన్ జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ షఫీ, ప్రభాకర్‌రెడ్డి, మోటమర్రి రామకృష్ణ, చింతల చిరంజీవి, కృష్ణంరాజు, గోవింద్, రాము, వీరు, క్రాంతి, శేఖర్, అశోక్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 13: 'నమస్తే' కథనంతో, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫాం అందింది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫాం అందించడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ తీవ్ర జాప్యం చేస్తున్నదంటూ ఈ నెల 12న 'నమస్తే తెలంగాణ' లో 'బాగా ఊరించారు....ఉసూరుమనిపించారు..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీతో, అప్పటికే మండలాలకు చేరిన యూనిఫాం పంపిణీకి ఐసీడీఎస్ అధికారులు శ్రీకారం చుట్టారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఈ యూనిఫాం పంపిణీని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు.

క్షయ పట్ల అవగాహన కలిగిఉండాలి

దుమ్ముగూడెం, డిసెంబర్ 13: ప్రతిఒక్కరూ క్షయ పట్ల అవగాహన కలిగి ఉండాలని దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యుడు పుల్లారెడ్డి అన్నారు. 'నిక్షయ్ షివిర్'లో భాగంగా దుమ్ముగూడెం పీహెచ్‌సీలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లచ్చిగూడెం ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని ప్రజలకు, నారాయణరావుపేటలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. గతంలో క్షయ వ్యాధికి మందులు వాడి ఉన్నా వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ సాగర్, పీపీఎం కోఆర్డినేటర్ సోమయ్య, టీబీ అలెర్ట్ ఇండియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఎస్‌టీఎస్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, ఏఎన్ఎం సరోజిని, హెచ్ఏ నర్సింహారావు, చలపతి, ఆశాలతో పాటు ఎంపీపీఎస్ హెచ్ఎం పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

దమ్మపేట రూరల్, డిసెంబర్ 13: మండలంలోని అల్లిపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కలిసి శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పంచాయతీ కార్యాలయానికి, సీపీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దమ్మపేట ఏఎంసీ చైర్మన్ వాసం రాణి పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

అశ్వారావుపేట, డిసెంబర్ 13: అశ్వారావుపేటలో డ్రైనేజీ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి

పాల్వంచ రూరల్, డిశంబర్ 13: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో బోగా నారాయణను మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. సర్వేపై ఎంపీడీవోతో శుక్రవారం కొత్వాల చర్చించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెద్దపులి వస్తోంది... అప్రమత్తంగా ఉండండి

ఆళ్లపల్లి, డిసెంబర్ 12: ములుగు జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి పెద్దపులి వచ్చే అవకాశం ఉందని.. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగళ్ల రేంజర్ జశ్వంత్ అన్నారు. కిన్నెరసాని అభయారణ్యంలోని రేగళ్ల రేంజ్ పరిసర ప్రాంత పొలాలకు వెళ్లే రైతులు, పశువుల, మేకల కాపరులు, అటవీ ఉత్పత్తులు సేకరించే వారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కోరారు. డప్పు చాటింపు ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రేగళ్ల రేంజ్ అడవుల్లో రేంజర్, సిబ్బందితో కలిసి గతంలో పులి సంచరించిన ప్రాంతాలను పరిశీలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

గిరిజన యువత సమయాన్ని వృధాచేయొద్దు...

వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం: మాట్లాడుతున్న పీవో రాహుల్, బూర్గంపహాడ్: మాట్లాడుతున్న శిక్షణ పొందిన యువత

బూర్గంపహాడ్, డిసెంబర్ 13: ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ గిరిజన యువత సమయాన్ని వృధా చేయకుండా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్‌లోని గౌతంపురంలో ఐటీసీ మిషన్ సునరేకల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఒకేషనల్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. యువతకు అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావును అడిగి తెలుసుకున్నారు. గిరిజన నిరుద్యోగ యువకులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో పాటు 60 రోజుల పాటు ఇస్తున్న ఎలక్ట్రికల్ డెవలప్‌మెం ట్ శిక్షణ శ్రద్ధగా నేర్చుకుని పదిమందికి ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. అనంతరం శిక్షణా కేంద్రంలో మొక్కలు నాటి శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, నరేశ్‌కుమార్, సెంటర్‌హెడ్, శిక్షకుడు శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్‌కుమార్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ జోష్ణదేవి, బలరామ్, సుమన్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పి ఆర్థికంగా ఎదగాలి

భద్రాచలం, డిసెంబర్ 13: ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా సబ్సిడీపై రుణాలు పొంది చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకుని ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎంఎస్ఎంఈ యూనిట్ ద్వారా చిన్న తరహా పరిశ్రమలు నడుపుతున్న లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పరిశ్రమ కోసం సబ్సిడీపై రుణం పొందారో ఆ యూనిట్ నడిపించి ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు. ఈ యూనిట్ల ద్వారా పదిమందికి ఉపాధి కల్పించినప్పుడే ఆ యూనిట్లు సక్రమంగా పనిచేస్తాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, ఎఫ్‌డీవో ఉదయ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ, వివిధ మండలాల నుంచి వచ్చిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవ మహిళ సాధికారక కేంద్రం సందర్శన

పాల్వంచ రూరల్, డిసెంబర్ 13: నవభారత్‌లోని 'నవ మహిళ సాధికారక కేంద్రా'న్ని ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం సందర్శించారు. చేతి వృత్తుల శిక్షణ వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. కుట్లు–అల్లికలు, పెయింటింగ్ శిక్షణ, బ్యూటీషియన్, తాటాకులతో గృహ అలంకరణ వస్తువుల తయారీని పరిశీలించారు. టైలరింగ్ మహిళలతో మాట్లాడారు. అధికారులు డేవిడ్‌రాజ్, హరికృష్ణ, ప్రసాద్, ఖాదర్, ఎం.శ్రీనివాస్, శిక్షకులు అరుణ, అంబుదా తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ఇల్లెందు, డిసెంబర్ 13: నిరుపేద బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్ పట్టణంలోని తన కార్యాలయంలో అందజేశారు. స్థానిక శాంతినగర్‌కు చెందిన కందాల రితిక్, ఖమ్మం ఎస్‌బీఐటీ కాలేజీలో బీటెక్ (సీఎస్‌సీ) మూడోసంవత్సరం చదువుతున్నాడు. చదువు కోసం అతడికి ల్యాప్‌టాప్ తప్పనిసరి. కానీ, పేదరికం కారణంగా కొనుక్కోలేకపోతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దిండిగాల రాజేందర్ స్పందించారు. చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎన్ఆర్ఐ వెనిగళ్ళ రవికుమార్ సహకారంతో రితిక్‌కు ల్యాప్‌టాప్‌ను శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎస్.రంగనాథ్, సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, ఎండి.జాఫర్ హుస్సేన్, అజ్మీరా బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభివృద్ధి అటకెక్కింది

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఈ ఏడాది కాలంలో అభివృద్ధి అటకెక్కిందని బీఆర్ఎస్ మణుగూరు పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్ ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చింది లేదని అన్నారు. కార్యక్రమంలో నూకారపు రమేశ్, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, ఎడ్ల శ్రీను, యాదగిరి గౌడ్, ప్రభుదాస్, రాంకోటి, రమేశ్, గుర్రం సృజన్, ఆవుల నర్సన్న, హర్ష, పీ.శ్రీను, చందర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

భద్రాద్రి జడ్పీ సీఈవో నాగలక్ష్మి

పాత ఎంపీడీవో కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నాగలక్ష్మి

అశ్వారావుపేట, డిసెంబర్ 13 : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని జడ్పీ సీఈవో నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన వివరాలను అంశాలవారీగా నమోదు చేయాలని సూచించారు. నారంవారిగూడెంలో చేపట్టిన ఇందిరమ్మ సర్వేను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. దరఖాస్తుదారుల పూర్తి వివరాలు సేకరించి ఇందిరమ్మ యాప్‌లోనే నమోదు చేయాలని స్పష్టం చేశారు. సర్వే పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆమె.. పాఠశాలలో బోధనా సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన పలువురిని ఉద్దేశించి సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, పిల్లల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కచ్చితంగా చదివించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ప్రసాదరావు, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 60 ఏళ్లు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 13: వ్యవసాయ విశ్వవిద్యాలయానికి శుక్రవారంతో 60ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా, స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం ఉత్సవాలు జరగనున్నాయి. కళాశాలలో శుక్రవారం విలేకరులతో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ జె.సత్యనారాయణ మాట్లాడుతూ.. 1964 ఏర్పడిన వ్యవసాయ విశ్వవిద్యాలయం అం చెలంచెలుగా అభివృద్ధవుతున్నదని, ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిందని చెప్పారు. కళాశాలలో శనివారం జరిగే ఉత్సవాల్లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొంటారని చెప్పారు. రైతులతో ముఖాముఖి, సాగులో మెళకువలు, చీడపీడల నివారణ, దిగుమతి తదితరాంశాలను అధికారులు వివరిస్తారని చెప్పారు. 30 రకాల వ్యవసాయ ఫలాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి, టెక్నికల్ ఆఫీసర్ కె.గోపాలకృష్ణమూరి పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 13: కొత్తగూడెంలోని జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేసులను రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బూర్గంపహాడ్, డిసెంబర్ 13: మండలంలోని సారపాక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7:00 నుంచి 9:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ గుర్రం ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏరియా జనరల్ మేనేజర్‌కు సన్మానం

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 13: సింగరేణి ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్యను ఆయన కార్యాలయంలో బీసీ సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. పులి పూర్ణచందర్‌రావు, గిరిధర్, గామాలపాటి మోహన్‌రావు, ఎస్‌వీఎస్ఎన్ రాజు, బండారు కోట సాంబయ్య, గుగ్గిళ్ళ యాదగిరి పాల్గొన్నారు.

భద్రత పక్షోత్సవాలు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 13: సింగరేణి ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్‌లో శుక్రవారం భద్రత పక్షోత్సవాలను జీఎం (ఈ అండ్ ఎం) కన్వీనర్ ఎన్.దామోదర్‌రావు నిర్వహించారు. 47 లెవల్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. జేకే కాలనీలో ఎలక్ట్రికల్ పరికరాలను ప్రమాదరహితంగా ఉంచిన వారికి బహుమతులు అందించారు. అధికారులు అప్పారావు, నరేందర్, రాజ్‌కుమార్, నాగరాజు కొదండరామ్, మంద గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యారెంటీల' అమలులో ప్రభుత్వం విఫలం

ఇల్లెందు, డిసెంబర్ 13: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ విమర్శించారు. పార్టీ స్థానిక కార్యాలయం ఏలూరి భవన్‌లో శుక్రవారం సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఇల్లెందులో జరిగే పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఆలేటి కిరణ్, తాళ్లూరు కృష్ణ, మన్నెం మోహన్‌రావు, కామా నాగరాజు, ఖాదర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బంది ముందస్తు అరెస్టులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: మున్సిపాలిటీ వి భాగాల్లో పనిచేస్తున్న మెప్మా సిబ్బంది తమ జీతాలు పెం చాలంటూ హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే ధర్నాకు త రలి వెళ్తుండగా పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు వారిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి సొంత పూచీకత్తుపై విడుదల చేశా రు.

16న సీఎం కప్‌కు బాక్సింగ్ జట్టు ఎంపిక

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 13: సీఎం కప్ బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 16న ప్రగతి మైదానంలో నిర్వహించనున్నట్లు హెడ్ కోచ్‌లు సత్యబాబు, శ్రీనివాస్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మట్టపర్తి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కోచ్‌లను 92999 03203, 80393 78886 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

చిల్లర కౌంటర్లపై దాడులు

టేకులపల్లి, డిసెంబర్ 13: మండలంలోని రామచంద్రునిపేట గ్రామంలో అనుమతులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న చిల్లర కౌంటర్లపై ఇల్లెందు మార్కెట్ యార్డ్ కార్యదర్శి నరేష్‌కుమార్ శుక్రవారం దాడులు నిర్వహించి జరిమానాలు విధించి, పత్తి కాంటాలను స్వాధీనపర్చుకున్నారు. మొక్కజొన్న లోడ్‌తో ఉన్న మూడు లారీలను, ఒక పత్తి లోడ్ లారీని మార్కెట్ యార్డుకు తరలించారు.

'ఇందిరమ్మ' దరఖాస్తుల విచారణ ప్రారంభం

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 13: కొత్తగూడెం 23వ వార్డు కూలీలైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల విచారణను కౌన్సిలర్ వై.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు.

సింగరేణి కోఆర్డినేషన్ జీఎం పర్యటన

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 13: సింగరేణి కొత్తగూడెం ఏరియాలో కో ఆర్డినేషన్ జీఎం ఎస్‌డీఎం సుభాని శుక్రవారం పర్యటించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీని సందర్శించారు. జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్, కిష్టారం ఓసీ పీవో ఎంవి.నరసింహారావు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి

పాల్వంచ రూరల్, డిశంబర్ 13: రజక హక్కుల సాధనకు రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని రజక సంఘం శ్రేణులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపెల్లి దుర్గాప్రసాద్ కోరారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీను, రామకృష్ణ, రమేష్, నరేంద్ర, వెంకట్, అశోక్ పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 13: ఓటు హక్కు వినియోగంపై మండలంలోని కేఎస్ఎం కాలనీ, చాతకొండ, ఎస్సీ కాలనీ గ్రామాల్లో శుక్రవారం గ్రామ సమైక్య మండల సీసీ ప్రభావతి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రకరకాల కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరం

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: మణుగూరు పీహెచ్‌సీ పరిధిలోని బుగ్గ పంచాయతీ వలస ఆదివాసీ గ్రామాలైన బుగ్గ, ఖమ్మం తోగు, బుడుగులలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. వంద 'రోజుల నిక్షయ్ శివిర్'లో భాగంగా బుగ్గ, బడుగుల, ఖమ్మం తోగులో క్షయ గురించి అవగాహన కల్పించారు.

ఐటీసీ యూనిట్ హెడ్‌ను కలిసిన బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

బూర్గంపహాడ్, డిసెంబర్ 13: ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టిన శైలేంద్రసింగ్‌ను రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్, భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి శుక్రవారం కలిసి శాలువాతో సత్కరించారు.

టీజీటీఏ జిల్లా నూతన కమిటీ సమావేశం

చుంచుపల్లి, డిసెంబర్ 13: తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం కొత్తగూడెంలోని మధువన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) జనరల్ సెక్రటరీ వాళ్ల బిక్షం, వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి 108 ఉద్యోగి మృతి

ప్రణయ్ మృతికి కారకులైన వారిని అరెస్టు చేయాలి

మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన బంధువులు

పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ప్రణయ్ (ఫైల్)

పినపాక/కరకగూడెం, డిసెంబర్ 13: మధ్యవర్తిగా ఉండి డబ్బులు అప్పు ఇప్పించిన, తీసుకున్న వారు డబ్బులు చెల్లించకపోవడంతో డబ్బులు ఇచ్చిన వ్యక్తి ఒత్తిడి చేయడంతో మనస్థాపానికి గురై 108 ఉద్యోగి ప్రణయ్ పురుగుమందు తాగి 13 రోజులు మృత్యువుతో పోరాడి మృతిచెందాడు. మృతుడు ప్రణయ్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెం మండలం చిరుమల్ల గ్రామానికి చెందిన దోమల ప్రణయ్ 108 వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రణయ్ తన స్నేహితులైన కొంత మందికి తాను పనిచేస్తున్న 108 వాహనంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన ఉమా సుబ్బారెడ్డి దగ్గర మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించాడు. అప్పు తీసుకున్న వారు అప్పు చెల్లించకపోవడంతో సుబ్బారెడ్డి ప్రణయ్‌పై ఒత్తిడి తెచ్చాడు. అంతేకాక ప్రణయ్ ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లాడు. అప్పటికే అయ్యప్ప దీక్షలో ఉన్న ప్రణయ్ మనస్థాపం చెంది ఎవరికి తెలియకుండా పురుగుమందు తాగాడు. స్వతహాగా వైద్య శాఖలో పనిచేస్తున్నందున కొంత ట్రీట్‌మెంట్ తానే చేసుకొని ఈ నెల 2వ తేదీన ఇరుముడి కట్టుకొని తోటి స్వాములతో కలిసి శబరిమలై వెళ్లాడు. శబరిమలై దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రణయ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతని వెంట ఉన్న స్నేహితులు ప్రణయ్‌ని విజయవాడలో వైద్య చికిత్సలు చేయించి ఖమ్మం తీసుకొచ్చి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడ అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రణయ్ సెల్‌ఫోన్‌లో స్వయంగా వీడియో కాల్‌లో మాట్లాడిన విషయాలు బయట పడ్డాయి. సుమారు 13 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ప్రణయ్ మృతి చెందాడు. మృతదేహానికి శవ పరీక్ష అనంతరం బంధువులు మృతదేహంతో ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌పై, కరకగూడెంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ప్రణయ్ మృతికి కారకులైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నలుగురి వ్యక్తులపై కేసు నమోదు

పురుగుమందు తాగిన కేసులో ఈ బయ్యారం గ్రామానికి చెందిన ఉమా సుబ్బారెడ్డి, కరకగూడేనికి చెందిన రావుల తేజ, సిరిశెట్టి రవితేజ, జట్టి అభిరాములపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడు ప్రణయ్ బంధువులు, స్నేహితులు, మృతుడి సోదరి నవ్యశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, డిసెంబర్ 13: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

రామయ్యను దర్శించుకున్న ఎన్నికల కమిషనర్

రామయ్య సన్నిధిలో ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి దంపతులు

భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామివారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదానానికి వితరణ

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్నదానానికి ఏపీలోని కృష్ణా జిల్లా గన్నవరం రాయ్‌నగర్‌కు చెందిన కస్తాల వెంకటప్రకాశ్ దంపతులు శుక్రవారం రూ.1,00116లు ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భద్రాద్రిలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

భద్రాచలం, డిసెంబర్ 13: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 31నుంచి జనవరి 10వ తేదీవరకు జరిగే వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఆలయ సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు. రూ.52.59లక్షలతో 12 రకాల పనులను దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేపడుతున్నారు. రామాలయం నాలుగు వైపులా గోపురాలుకు, ఉత్తరద్వారానికి రంగులు వేస్తున్నారు. అదేవిధంగా రామాలయం ప్రహరీకి జనవరి 10వ తేదీన ఉత్తర ద్వారంలో స్వామిని తిలకించేందుకు వీవీఐపీ, వీఐపీలు, భక్తులు అధికసంఖ్యలో రానుండటంతో బందోబస్తు ఏర్పాట్లను భద్రాచలం ఇన్‌చార్జి డీఎస్పీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఒకపక్క వైకుంఠ ఏకాదశి పనులు ముమ్మరంగా జరుగుతుండగా మరోపక్క భద్రాద్రి ఆలయ అధికారులు ఉత్తరద్వారదర్శనానికి ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ల విక్రయాలు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి పనులను ఎప్పటికప్పుడు ఆలయ ఈవో రమాదేవి, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ నివాళి

భద్రాచలం, డిసెంబర్ 13: పట్టణంలోని అడుసుమిల్లి జగదీశ్ మామయ్య తూము వెంకటేశ్వరరావు (తాతయ్య) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం పట్టణంలో జరిగిన వెంకటేశ్వరరావు సంస్మరణ సభకు ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు హాజరై వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, ఆకోజు సునీల్‌కుమార్, అయినాల రామకృష్ణ, కొల్లం జయప్రేమ్‌కుమార్, కోలా రాజు, గుంజా ఏడుకొండలు, వల్లూరుపల్లి వంశీకృష్ణ, కామిరెడ్డి రామకొండారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి

టేకులపల్లి, డిసెంబర్ 13: రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతిచెందారు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ కంగల లక్ష్మయ్య(35), శుక్రవారం తెల్లవారుఝామున మహబూబాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై టేకులపల్లి వెళ్తున్నారు. తొమ్మిదోమైల్ తండా మూలమలుపు వద్ద ఆయన వాహనం అదుపు తప్పి, జెండా గద్దెకు గుద్దుకుంది. తలకు తీవ్ర గాయాలతో ఆయన మృతిచెందారు. ఆయనకు భార్య, ఏడాది వయసున్న పాప ఉన్నారు. లక్ష్మయ్య తండ్రి మారయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట జూదరులపై కేసు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 13: పదిమంది పేకాట జూదరులపై శుక్రవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని దంతెలబోర ఎస్సీ కాలనీ శివారులో పేకాట శిబిరంపై ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. తొమ్మిది మంది జూదరులు పరారయ్యారు. ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రెండువేల రూపాయలు, ఒక సెల్ ఫోన్ స్వాధీనపర్చుకున్నారు. మొత్తం పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మెప్మా రిసోర్స్ పర్సన్స్ అరెస్ట్

కొత్తగూడెం క్రైం/పాల్వంచ రూరల్, డిసెంబర్ 13: 'చలో హైదరాబాద్' పిలుపు నేపథ్యంలో పాల్వంచ తదితర ప్రాంతాల్లో మెప్మా రిసోర్స్ పర్సన్స్‌ను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. దీనిని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ఖండించారు.

వాహనాల్లోని బ్యాటరీలు చోరీ

బూర్గంపహాడ్, డిసెంబర్ 13: మండలంలో బ్యాటరీ దొంగలు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ఆటోలు, వాహనాలు టార్గెట్ చేసి వాటికున్న బ్యాటరీలను తీసుకెళ్తున్నారు. సారపాకలోని గాంధీనగర్‌కు చెందిన కొత్తూరు విష్ణుకు చెందిన ఆటో నుంచి బ్యాటరీని గురువారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు నిఘా పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 13: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన కూలీలు శుక్రవారం జామాయిల్ కర్ర నరికేందుకు ఎర్రగుంట వైపు వెళ్లి, ఆటోలో తిరిగొస్తున్నారు. నామవరం వద్ద, ఈ ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న కుక్కముడి అనిల్(30), మాయర రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 సిబ్బంది కొత్తగూడెం వైద్యశాలకు తరలించారు. అప్పటికే కుక్కముడి అనిల్ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

వాహనదారులకు జరిమానా

భద్రాచలం, డిసెంబర్ 13: మద్యం సేవించి వాహనాలు నడిపిన 29 మందిని పోలీసులు భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. విచారణ అనంతరం 21 మందికి జరిమానా విధించి ఇద్దరికి మూడు రోజుల జైలుశిక్ష, రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే మరో ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుందని జడ్జి తీర్పు ఇచ్చారు.

వ్యవసాయ మోటర్ల చోరీ

చంద్రుగొండ, డిసెంబర్ 13: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో రెండు వ్యవసాయ విద్యుత్ మోటర్లు చోరీ అయ్యాయి. తిప్పనపల్లి రైతులు కందిమళ్ల శ్రీను, ఎల్లబోయిన మల్లయ్య.. తమ పొలాల వద్ద ఎదుళ్లవాగులో రెండు మోటర్లను అమర్చారు. వీటిని శుక్రవారం తెల్లవారుఝామున దుండగులు చోరీ చేశారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.